# గొంతులేని వారి గొంతు

**ప్రముఖ** మానవహక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్ ఆకస్మిక మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. పౌరహక్కుల ఉద్యమకారునిగా ఎక్కువగా పరిచితమైనప్పటికీ ఆయన చింతన, కృషి, వ్యక్తిత్వమూ బహుముఖీయమైనవి. గణితంలో పరిశోధన అనంతరం తొలుత అధ్యాపక వృత్తిని చేపట్టినా ఆ తరువాత ఉద్యమ జీవితంలో సాహిత్యం, సమాజం, చరిత్ర, రాజనీతి, న్యాయశాస్త్రం తదితర రంగాలలో అధ్యయనం, రచనలు చేశారు. మహిళలు, దళితులు, ఆదివాసీల, నిర్వాసితుల వంటి భిన్న సామాజిక వర్గాల ఉద్యమాలతో మమేకం అయ్యారు. బాలగోపాల్ వంటి అసాధారణ ప్రజ్ఞ, కార్యశీలత కలబోసిన వ్యక్తిత్వం గల వారు బహు అరుదుగా ఉంటారు. రాజ్యం అణచివేతకు, హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా ఆయన అనుక్షణం అవిశ్రాంత పోరాటం సాగించారు.

ఉద్యమ బాలలు ఊయలలూగిన కాకతీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న బాలగోపాల్ 1885లో ఉద్యోగానికి రాజీనామా చేసి పౌరహక్కుల పరిరక్షణకు పూర్తిస్థాయిలో అంకితమయ్యారు. స్థూలంగా ప్రజాస్వామ్య హక్కుల పట్ల అవగాహన ఉన్నప్పటికీ, పౌరహక్కుల చైతన్యం ఇంకా తగినంతగా విస్తరించని రోజులలో బాలగోపాల్ ఉద్యమం ప్రారంభమైంది. రాజ్యమే ఒక పక్షం వహించి ఇతర పక్షాలపై పౌరహక్కుల ఉల్లంఘనకు పాల్పడినప్పుడు, దానిని ఎదుర్కొనే యంత్రాంగం, వ్యవస్థలు లేవనిఆ లోటును పౌరహక్కుల ఉద్యమాల ద్వారా పూడ్చాలంటూ తమ కార్యక్రమ ఆవశ్యకతను విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజలకు

హక్కుల పట్ల స్పృహను పెంచారు. సంక్షుభిత తెలంగాణలో ఎన్‌కౌంటర్లు నిత్యకృత్యమైనప్పుడు, ప్రశ్నించడమే మహా నేరంగా మారిన భయానక వాతావరణంలో ఘటనాస్థలికి వెళ్ళడం, ఆ ఉద్రిక్త పరిస్థితుల మధ్య వివరాలు సేకరించి పోలీసుల కృత్యాలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేయడం, ఉద్యమం నడపడం అసాధారణం. అప్పటికే జాతీయ స్థాయిలో మానవ హక్కుల ఉద్యమ ప్రముఖులున్నప్పటికీ, జీవితమే ఉద్యమంగా, క్షేత్రస్థాయిలో సామాన్య కార్యకర్త మాదిరిగా పనిచేయటం బాలగోపాల్ విశిష్టత. బాలగోపాల్ ఎంచుకున్న దారే ముళ్ళబాట. ఉద్యమ జీవితమంతా బెదిరింపులు, దాడుల మధ్య రాజీ లేకుండా సాగించారు. బాలగోపాల్ కిడ్నాప్ దేశవ్యాప్తంగా కలవరం సృష్టించింది. పోలీసు యంత్రాంగం ప్రేరణతో జరిగినట్లు భావించిన ఆ ఉదంతంలో ఆయన మూడు రోజుల పాటు కిడ్నాపర్ల చెరలో గడిపారు. మరణం అంచులదాకా వెళ్లి వచ్చిన తరువాత కూడా బాలగోపాల్ నిబ్బరం, నిబద్ధత అణువంత సడలలేదు.

పౌరహక్కుల పరిరక్షణ కోసం అహరహం శ్రమిస్తూనే బాలగోపాల్ క్రమంగా దాన్ని మానవ హక్కుల ఉద్యమంగా విస్తరించారు. పౌరహక్కుల పరిరక్షణ కేవలం విప్లవోద్యమాలకు సంబంధించిన సమస్య మాత్రమే కాదనీ, సాధారణ రాజకీయ నాయకులతో సహా అందరూ హక్కుల పరిరక్షణకు నడుం బిగించాలని ఆకాంక్షించా రాయన. ప్రభుత్వం, పాలకపక్షం, రాజ్యం నేరుగాప్రయోగించే హింసలను, హక్కుల ఉల్లంఘలను మాత్రమే కాక – ప్రాబల్య వర్గాల ప్రోత్సాహం వల్లకానీ, అలక్ష్యం వల్ల కానీ, విధానపరమైన అన్యాయాల వల్ల కానీ జరిగే హక్కుల ఉల్లంఘనలను కూడాహక్కుల ఉద్యమం పట్టించుకోవాలని ఆయన విశ్వసించారు. విభిన్న వర్గాలు, భిన్న ప్రయోజనాలు కలిగిన సమాజంలో ఒక్కొక్కసారి ప్రజాశ్రేణులు నిర్వహించే ఉద్యమాలు కూడా తక్కిన వారి హక్కులను హరిస్తాయని ఆయన గుర్తించారు. సంఘాలు, పార్టీలు వంటి సంఘటిత వ్యవస్థలు సైతం వ్యక్తుల, బలహీన సమూహాల హక్కులను హరించినప్పుడు – భాధితులు నిస్సహాయులవుతారని ఆయన భావించారు. ఈ అవగాహనకు పౌరహక్కుల సంఘంలో వ్యతిరేకత వ్యక్తం కావడంతో, ఆయన అందులో నుంచి బయటకు వచ్చి మానవహక్కుల వేదికను స్థాపించారు. బాలగోపాల్ మునుపటివలె ఉధృతంగా పని చేయబోరని, క్రమంగా సాధారణ జీవితంలోకి మరలివెడతారని ఆశించినవారికి ఆశాభంగం ఎదురైంది. మానవ హక్కుల వేదిక

కార్యకర్తగా, నేతగాఆయన మరింత దీక్షతో, మరింత విస్తృత పరిధిలో పనిచేయనారంభించారు.

రాయలసీమలో ఏనుగుల బీభత్సానికి సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్న ప్రాంతాలు తిరిగి అక్కడి పరిస్థితిని చాటారు. కాశ్మీరులోని సరిహద్దు ప్రాంతానికి వెళ్ళి మందు పాతరల మధ్య దినదినగండంగా బతుకుతున్న ప్రజల పరిస్థితినీ వివరించారు. ఛత్తీస్‌గఢ్ వెళ్ళి సల్వాజుడుం పేర సాగుతున్న ఘోరాన్నీ కళ్ళకు కట్టారు. మైనారిటీలపై ఉగ్రవాద అభియోగాలు మోపినప్పుడు – నిందితులకు న్యాయ సహాయం అందించారు. కొత్త ఆర్థిక విధానాల ఫలితంగా ఏర్పడిన అగచాట్లు ఆయనకు ఊపిరి సలవని పని కల్పించాయనవచ్చు. సెజ్ బారినపడిన ప్రజల బాధలనూ పట్టించుకున్నారు. నిర్వాసితుల కోసం ఉద్యమించారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ బాధితులకు తోడుగా నిలిచారు. రాయలసీమ ఫ్యాక్షన్ సంస్కృతినీ వ్యతిరేకించారు. ఉద్యమకార్యకర్తగానే కాదు, న్యాయవాదిగా కూడా అనేక ఎన్‌కౌంటర్ కేసులు చేపట్టారు. ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు, పోలీసులను నిందితులుగా గుర్తించి దర్యాప్తు సాగించాలని వాదించారు. ఇందుకు న్యాయస్థానం అంగీకరించింది.

బాలగోపాల్ నిరంతర అధ్యయనశీలి. భారత చరిత్ర పరిశోధనా రీతిని మలుపు తిప్పిన డి.డి.కోశాంబి రచనను తెలుగు పాఠకులకు పరిచయం చేసి కొత్త దృక్కోణాన్ని అందించారు. అదే రీతిలో సామాజిక సమూహాలను, గ్రామ దేవతల గుళ్ళను పరిశీలించేవారు. ఆయన నిరాడంబరజీవి. ముక్తసరిగా మాట్లాడే మనస్తత్వమైనా లోతైన విషయాలను స్పష్టంగా వివరించే వారు. పసితనపు నిష్కల్మషత్వమూ, విషయ పరిజ్ఞానమూ ఆయనలో తొణికిసలాడేవి. సున్నిత మనస్కుడిగా గుర్తింపు పొందినా, వివాదాస్పద అంశాలపైనా నిర్మొహమాటంగా, సూటిగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారు. విమర్శలో ఘాటైన వ్యంగ్యమూ చోటు చేసుకునేది.

అలుపెరగని ఉద్యమ జీవితంలోనూ ఆయన వెసులుబాటు చేసుకుని వ్యాసాలు రాసేవారు. ఈవ్యాసాల ద్వారా శ్రీలంకలో తమిళుల పరిస్థితినీ వివరించారు. కేంద్రీయ విద్యాసంస్థలలో వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పిస్తే అగ్రవర్ణాల విద్యార్థులకు సీట్లుపెరిగిన వైనాన్ని, ప్రభుత్వ న్యాయస్థానాల పాత్రను వివరించారు. ఎప్పటికప్పుడు సామాజికఅవసరాలకు అనుగుణంగానే బాలగోపాల్ అధ్యయనం, కార్యాచరణ

సాగాయి. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రతి రెండు వారాలకు ఒకసారి ఆయన వరుసగా రాస్తూ వస్తున్న వ్యాసాలు వర్తమాన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను బాధితుల పక్షం నుంచి వ్యాఖ్యానించేవి. ఆయన చివరి వ్యాసం (అక్టోబర్ 7, 2009 – దొడ్డిదారిన మరో విపత్తు) మనదేశం 30 దేశాలతో చేసుకున్న ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పర్యవసానంగా వ్యవసాయరంగంలో ఎదురుకానున్న ప్రమాదాల గురించి రాసినది.

దాదాపు మూడు దశాబ్దాల ఉద్యమ జీవితంలో సాధారణ ప్రజల్లో అసాధారణ స్థాయిలో మానవ హక్కుల స్పృహ కల్పించడమే కాదు. మధ్య తరగతి మేధావి వర్గాన్నీ ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయగలగడం బాలగోపాల్ ఘనత.

*శనివారం, 10, అక్టోబరు 2009 ఆంధ్రజ్యోతి సంపాదకత్వం*